
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక
ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 98 | మంగళవారం 14 జూలై 2026 | పేజీలు : 4 | వెల : 3/-




# ప్రభుత్వ నిర్లక్ష్యమే మత్స్యకారుల ప్రాణాలు బలిగొంది



-- బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలి
-- బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం
-- మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి



**(అంకుశం, విశాఖపట్నం, జూలై 14):**
విశాఖ బోటు ప్రమాదంలో మత్స్యకారులు ప్రాణాలు కోల్పోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున పరిహారం, ప్రమాదంలో నష్టపోయిన బోటుకు బదులుగా కొత్త బోటును ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ అండగా ఉంటుందని, వారి తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఘటనపట్ల కుటుంబ సభ్యులు ఫిషరీస్ శాఖ, మెరైన్ పోలీసు, జిల్లా యంత్రాంగానికి వరుసగా - మిగతా2లో



## తిరుమలలో భక్తులకి మరిన్ని మెరుగైన సేవలు అందిస్తాం

టీటీడీ ట్రస్టులు, పథకాల దాతల ప్రివిలేజెస్‌లో మార్పులు
నేటి అర్ధ రాత్రి నుండి అమలు
ఎస్ఎస్‌డి భక్తులకు నూతన షెడ్లు, క్యూలైన్లు
రూ.17.84 కోట్లతో ఒంటిమిట్టలో 100 గదుల నిర్మాణం
టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు



## అధికారులు నాలుగు గోడలు దాటి వెళ్లాలి

అప్పుడే ప్రజా సమస్యలు తెలుస్తాయి
'2019--2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం!
ఇక నుంచి ప్రతీ నెలా... ఆర్థిక నివేదికలు విడుదల
అర్జీల పరిష్కారం, క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరి
మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు

**(అంకుశం, అమరావతి, జూలై 14):**
ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై - మిగతా2లో



## రేపు భీమవరానికి వైయస్ జగన్ రైతులతో ముఖాముఖి

**(అంకుశం, తాడేపల్లి, జూలై 14):**



రాష్ట్రంలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఆక్వా రైతులకు అండగా నిలిచేందుకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పర్యటనకు వెళ్లనున్నారు. పెరుగుతున్న ఆక్వా ఫీడ్ ధరలు, గిట్టుబాటు ధరల లేమి, అధిక ఉత్పత్తి వ్యయాలు, విద్యుత్ ఛార్జీల భారం, ఎగుమతుల్లో ఎదురవుతున్న సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని భరోసా ఇవ్వనున్నారు. రైతుల ఆవేదనను నేరుగా విని, వారి సమస్యల పరిష్కారం కోసం వైయస్ఆర్‌సీపీ తరఫున పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన తెలియజేయనున్నారు. భీమవరం చేరుకున్న అనంతరం ఉండి బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన సభావేదిక వద్ద ఆక్వా రైతులతో వైయస్ జగన్ సమావేశమవుతారు. ఈ సందర్భంగా ఆక్వా రంగంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, ప్రభుత్వ విధానాల ప్రభావంపై నేరుగా రైతులతో చర్చించనున్నారు. ఆక్వా ఫీడ్ కంపెనీలు వరుసగా ధరలు పెంచడంతో రైతులపై పడుతున్న అదనపు భారం, పెట్టుబడులు పెరిగినా రొయ్యలు, చేపలకు గిట్టుబాటు ధరలు లేక నష్టాలు ఎదుర్కొంటున్న పరిస్థితిపై రైతుల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు, ఎగుమతుల్లో తలెత్తుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సంక్షోభంపై కూడా రైతులతో విస్తృతంగా చర్చించనున్నారు. ఆక్వా రైతులను పరామర్శించి వారి సమస్యలను ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లడంతో పాటు, రైతులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని వైయస్ జగన్ భరోసా ఇవ్వనున్నారు.

## మాజీ మంత్రి ముద్రగడ మృతి

**(అంకుశం, హైదరాబాద్, జూలై 14):**

మాజీ మంత్రి, వైకాపా నేత ముద్రగడ పద్మనాభం (73) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. గతకొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయత్రం తుదిశ్వాస విడిచారు. ముద్రగడ పద్మనాభం 1953 జనవరి 22న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించారు. తండ్రి మరణానంతరం 1977లో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జనతా పార్టీ తరఫున ప్రత్తిపాడు నుంచి విజయం సాధించారు.1982లో తెదేపాలో చేరిన ముద్రగడ.. 1983, 1985, 1989 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం ఆ పదవితో పాటు తెదేపాకు రాజీనామా చేశారు. ప్రజారక్షణ సమితి, తెలుగునాడు పార్టీలను ముద్రగడ పద్మనాభం స్థాపించారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ఆయన.. 1994లో ఆ సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం దీక్ష చేశారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా గెలుపొందారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2016లో తునిలో కాపు ఐక్య గర్జన సభ నిర్వహించారు. 2024 ఎన్నికలకు ముందు వైకాపాలో చేరారు. ఆయన మృతి పట్ల మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో జగన్ ఫోన్ లో మాట్లాడి ధైర్యం చెప్పారు.



# ముంబయిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 14:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..జనసేనాని కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం జనసేనాని పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి



దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

# మూడు గ్రీన్ ఫీల్డ్ పోర్టుల ఫేజ్--2 విస్తరణకు ఆమోదం

**పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

**6,248.54 ఎకరాల భూసేకరణకు రూ. 1638.52 కోట్లు మంజూరు**




**(అంకుశం, అమరావతి, జులై 14):** తీరప్రాంత అభివృద్ధిలో భాగంగా భవిష్యత్తు అవసరాలు, పోర్టుల విస్తరణను దష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టుల అభివృద్ధికి ఫేజ్ 2 లో భాగంగా భూసేకరణకు ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రామాయపట్నం, మూలాపేట, మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుల రెండో దశ విస్తరణకు మొత్తంగా 6,248.54 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ. 1638.52 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర సచివాలయంలో మాట్లాడుతూ.. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్ 2 అభివద్ధిలో భాగంగా 1420.70 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ. 347 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. మూలాపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్ 2 అభివద్ధిలో భాగంగా 1903.39 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ. 440.52 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామన్నారు.. ఉప్పు భూములతో కలిపి దాదాపుగా ఈ 1903 ఎకరాల భూముల్లో భూసేకరణ చేయనున్నామన్నారు. అలాగే ఆర్ -- ఆర్ కూడా ఇందులోనే చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్ 2 అభివద్ధిలో భాగంగా 2924.45 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ. 851 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామన్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చిన్న ఈటివాకం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుకు 63.01 ఎకరాలు కేటాయించినట్లు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు...నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ సంస్థ ప్రతిపాదనల మేరకు ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా భూమి కేటాయింపులు చేయనున్నట్లు మంత్రి తెలియజేశారు. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ సంస్థ స్థానికంగా దాదాపు రూ. 255 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన క్రమంలో దాదాపు 63 ఎకరాల భూమిని సదరు సంస్థకు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటు ద్వారా స్థానికంగా వెయ్యి మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు మంత్రి వివరించారు.

# ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదు?

ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. టీనేజీ వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో (ూజుూ) చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి టీనేజ్ ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైందా అనే ప్రశ్నను కూడా లేవనెత్తింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం-యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన సుమోటో కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు బెంచ్ 'ప్రేమలో ఉన్న ఓ అబ్బాయి, అమ్మాయి కలిసి వెళ్లిపోకుండా ప్రభుత్వం లేదా వ్యవస్థ ఎలా అడ్డుకోగలదు? పిల్లలపై జరిగే లైంగిక దాడులు, దోపిడీని అరికట్టేందుకే పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారు. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అనేది సులభంగా ముప్పునకు లేదా ప్రభావానికి లోనయ్యే వయసు. ప్రయోగాలు చేసే సున్నితమైన దశ. అలాంటప్పుడు ప్రతి ప్రేమ వ్యవహారాన్ని పోక్సో కేసుగా ఎలా మారుస్తారు?' అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 2023లో కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఒక వివాదాస్పద తీర్పులో యువతులు తమ లైంగిక కోరికల్ని నియంత్రించుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో సుప్రీం కోర్టు 2024లో ఆ తీర్పును రద్దు చేసి, యుక్త వయస్కుల గోప్యత హక్కుల అంశంపై సుమోటో కేసు నమోదు చేసింది. ప్రస్తుతం అదే కేసు విచారణ కొనసాగుతోంది.



**'తల్లిదండ్రులు పరువు కోసం క్రిమినల్ కేసులు పెడుతున్నారు'**

విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ ఈ కేసు నేపథ్యాన్ని వివరించారు. ఒక మైనర్ బాలిక 25 ఏళ్ల వ్యక్తితో స్వచ్ఛందంగా వెళ్లి ప్రస్తుతం అతనితో కలిసి జీవిస్తూ, వారికి ఒక బిడ్డ కూడా ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. పోక్సో చట్టం కారణంగా ఇలాంటి సంబంధాల్లో ఉన్న యువకులు జైలుకు వెళ్లాల్సి వస్తోందని ఆమె వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం '16 నుంచి 18 ఏళ్ల మధ్య యువత ప్రేమలో పడి కలిసి వెళ్లిపోతారు. కుటుంబ పరువును కాపాడుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. చివరికి కోర్టులు వారిని నిర్దోషులుగా విడుదల చేయాల్సి వస్తోంది' అని వ్యాఖ్యానించింది.

2012లో పోక్సో చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత సమ్మతి వయసును 16 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు పెంచారని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. అయితే టీనేజీ ప్రేమ సంబంధాలు 2012 తర్వాత మాత్రమే మొదలయ్యాయని చెప్పలేమని, ఇలాంటి ఘటనలు గతంలో కూడా ఉండేవని పేర్కొంది. బాల్య వివాహాలు కూడా గతంలో సాధారణమేనని ధర్మాసనం గుర్తు చేసింది. అయితే చట్టం మారడంతో ఇప్పుడు అలాంటి సంబంధాలు నేర పరిధిలోకి వచ్చాయని వివరించింది.

**పోక్సో కేసుల పర్యవేక్షణపై సూచనలు**

పోక్సో చట్టం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం అని మాధవి దివాన్ అభిప్రాయ పడ్డారు. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ప్రతి హైకోర్టులో ఇప్పటికే బాలల హక్కుల కమిటీలు పనిచేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ కేసుల్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం కూడా పోక్సో చట్టం అమలుకు సంబంధించి కొన్ని సిఫార్సులు చేసినట్లు కోర్టుకు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను సుప్రీం కోర్టు జులై 17కు వాయిదా వేసింది.

**బహిరంగ ప్రదేశాల్లో పోర్న్ చూడటంపై నిషేధించాలి!- కోర్టు ఏం చెప్పిందంటే?**

బహిరంగ ప్రదేశాల్లో అశ్లీల (పోర్నోగ్రఫీ) వీడియోలు, కంటెంట్ చూడటాన్ని నిషేధించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కోరుతూ దాఖలైన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (ూ×ూ) సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ అంశం న్యాయపరమైనది కాదని, విధానపరమైన నిర్ణయాలకు సంబంధించినదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ అంశం ప్రాధాన్యత కలిగినదేనని అంగీకరించినప్పటికీ, దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అని పేర్కొంది.

# ప్రభుత్వ నిర్లక్ష్యమే మత్స్యకారుల ప్రాణాలు బలిగొంది

**-మొదటిపేజీ తరువాయి**

సమాచారం అందించినప్పటికీ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోలేదన్నారు. సమన్వయంతో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి ఉంటే మరింత మంది ప్రాణాలు దక్కేవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని వైయస్ జగన్ గుర్తు చేశారు. మత్స్యకారుల మరణాలపై ఎక్స్‌గ్రేషియాను రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచడంతో పాటు, విదేశాల్లో చిక్కుకున్న మత్స్యకారులను స్వదేశానికి తీసుకురావడం, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం, విశాఖ ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాద బాధితులకు వెంటనే పరిహారం అందించడం వంటి అనేక సంక్షేమ చర్యలు చేపట్టామని వివరించారు. బోటు ప్రమాద బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని వైయస్ జగన్ స్పష్టం చేశారు.

## అధికారులు నాలుగు గోడలు దాటి వెళ్లాలి



**-మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలి. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్ధిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. నెలవారీ ఆర్ధిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'2019--2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్ధంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. 'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. ఎల్‌నినో కారణంగా తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక మంచి అధికారి సమస్యలను పరిష్కారిస్తే...అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చూస్తారనే కోణంలో అందరూ పనిచేయాలి. ఈ సమావేశానికి మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్ఓడీలు హాజరయ్యారు.

## తిరుమలలో భక్తులకి మరిన్ని మెరుగైన సేవలు అందిస్తాం

**అంకుశం న్యూస్ తిరుమల జూలై 14** టీటీడీలోని వివిధ ట్రస్టులు మరియు స్కీమ్‌లకు విరాళాలు అందించే దాతలకు కల్పిస్తున్న ప్రివిలేజెస్‌లో పలు మార్పులు చేస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ బోర్డు సమావేశం జరిగింది. అనంతరం టీటీడీ ఛైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ, విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరీతి (యూనిఫార్మిటీ) తీసుకురావడానికి టీటీడీకి చెందిన అన్ని ట్రస్టులు, పథకాలకు విరాళాలు అందించే దాతలకు కల్పించే ప్రివిలేజెస్‌లో పలు మార్పులు చేపట్టామన్నారు. ఈ కొత్త నిబంధనలు ఈ రోజు అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయని తెలిపారు. అయితే, ఇప్పటికే వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రివిలేజెస్ యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు.

**బోర్డు సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలు....**

రూ. 6.31 కోట్లతో తిరుమలలో ూూణ టోకెన్లు కలిగిన భక్తులు వేచి ఉండేందుకు ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్లు నిర్మించేందుకు టెండర్లు ఆమోదం. తిరుమలలోని కుమారధార, పసుపుధార డ్యామ్‌లు మరింత పటిష్టంగా ఉండేందుకు డబుల్ లేన్ వంతెన నిర్మాణానికి రూ. 2.77 కోట్లు మంజూరుకు ఆమోదం. తిరుమలలో గ్రీన్ ఎనర్జీ అభివృద్ధి చేయడంలో భాగంగా +చీజ సమీపంలో 800 కిలోవాట్ల విండ్ టర్బైన్ జనరేటర్‌ను విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారిచే విరాళంగా ఏర్పాటు చేసి, టీటీడీకి 25 సంవత్సరాల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు ఆమోదం. తిరుమల ఎస్వీ మ్యూజియంలో 12 ఏళ్లు పైబడిన సందర్శకులకు రూ. 50 గా (+ూతో కలిపి) ప్రవేశ రుసుము నిర్ణయించడమైనది. తదుపరి మ్యూజియం నిర్వహణ బాధ్యతలను టాటా సంస్థ ద్వారా నిర్వహించేందుకు గాను ఆ సంస్థను కోరాలని నిర్ణయం. తిరుమల కాకులమానుతిప్ప సమీపంలోని 25 ఏళ్లకు పైబడిన పాత ఘన వ్యర్థాలను బయో-రిమీడియేషన్, బయో-మైనింగ్ ద్వారా శాస్త్రీయంగా శుద్ధి చేయడానికి రూ. 5 కోట్లు మంజూరుకు ఆమోదం. భక్తుల భద్రత దృష్ట్యా తిరుమల, తిరుపతిలోని టీటీడీ ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల సమగ్ర నిర్వహణ కోసం రూ. 2.35 కోట్లతో నిర్వహణ పనులను నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయం. - తిరుమలలోని ు దీ జ మరియు ూ ు జ విశ్రాంతి భవనాల వద్ద ఉన్న 12 పాత భవనాలను తొలగించి, వాటి స్థానంలో దాతల సహకారంతో నూతన భవనానలు నిర్మించేందుకు నిర్ణయం. 2027వ సంవత్సరానికి సంబంధించి శ్రీవారి క్యాలెండర్లు, డైరీలు ముద్రించేందుకు టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఇందులో డైరీలు 10 లక్షలు, 12 పేజీల క్యాలెండర్లు 13.50 లక్షలు, 6 పేజీల క్యాలెండర్లు 75 వేలు ముద్రించేందుకు ఆమోదం. తిరుమల ఆక్టోపస్ బేస్ క్యాంప్‌లో అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు, ఖీమీ సేవలకు రూ. 2.91 కోట్లు మంజూరు. ఈ సమావేశంలో పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో డా. ఎ. శరత్, సివిఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యేను

# పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు





**ఎమ్మెల్యే అనుచరులు దాడిలో మాజీఎమ్మెల్యే కారు అద్దం ధ్వంసం**

**దాడి చేయించిన వారే పరామర్శ పేరుతో రావడం విడ్డూరమని ఎమ్మెల్యేపై మాజీఎమ్మెల్యే తీవ్ర విమర్శ**

**పోలీస్ శాఖ అధికార పార్టీకి కొమ్ముకాయడం తగదని ఆగ్రహం వ్యక్తం**

**ఎమ్మెల్యే రాకను వ్యతిరేకిస్తూ బాధితులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల బైఠాయింపు..**

**శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేసిన మాజీ ఎమ్మెల్యే**

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 14:** అనపర్తి నియోజకవర్గం, అనపర్తి మండలం రామవరం, కుతుకులూరు గ్రామాల్లో వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై జరిగిన దాడుల నేపథ్యంలో బాధితులను పరామర్శించేందుకు రామవరం వచ్చిన అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ సందర్భంగా పోలీసులతో మాట్లాడిన డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, "బాధితులను పరామర్శించే కార్యక్రమం ఎమ్మెల్యే అధికారిక షెడ్యూల్‌లో లేదు. నేను వస్తున్నాననే సమాచారం తెలుసుకుని ఇప్పుడు ఇక్కడికి రావడానికి ప్రయత్నించడం వెనుక ఉద్దేశం ఏమిటిని ప్రశ్నించారు. అలాగే, "బాధితుడైన సబ్బెళ్ళ కృష్ణారెడ్డి స్వయంగా తన ఇంటికి రావద్దని చెబుతున్నా, సిగ్గులేకుండా ఎలా వస్తారు? దాడి చేయించిన వ్యక్తే పరామర్శ పేరుతో రావడం రాజకీయ నాటకం కాక మరేమిటిని?" ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, "గ్రామంలో మళ్లీ ఉద్రిక్తతలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందడమే ఈ పరామర్శ వెనుక అసలు ఉద్దేశమని, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులదే కానీ, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ముందుగానే తమ పరామర్శ కార్యక్రమం ఖరారైందని, ఒకవేళ ఎమ్మెల్యేకు నిజంగానే బాధితులపై సానుభూతి ఉంటే ఘటన జరిగిన వెంటనే వచ్చి ఉండొచ్చని, లేకపోతే మరుసటి రోజు వచ్చినా ఎలాంటి అభ్యంతరం ఉండేది కాదని పేర్కొన్నారు. అదే సమయంలో రావడానికి ప్రయత్నించడం వెనుక రాజకీయ కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అధికార పార్టీ ఒత్తిళ్లకు లోనై వ్యవహరించడం పోలీస్ శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో బాధితులను పరామర్శించే హక్కును అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు.

రామవరం, కుతుకులూరు గ్రామాల్లో జరిగిన దాడులపై నిష్పక్షపాత విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి గారు డిమాండ్ చేశారు. రాజకీయ పక్షపాతం లేకుండా శాంతిభద్రతలను కాపాడాలని పోలీసు అధికారులను కోరారు. ఈ ఘటనతో అక్కడ భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బాధితులు బైఠాయించి ఎమ్మెల్యే రాకను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. "ప్రాణాలు పోయినా పరవాలేదు, గ్రామంలో ఉద్రిక్తతలు సృష్టించే రాజకీయాలకు అవకాశం ఇవ్వం" అంటూ తమ నిరసనను వ్యక్తం చేయగా, రామవరం గ్రామంలో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు.

## క్రీడా కోటా కింద 18 మంది గ్రామ మహిళా పోలీసులకు నియామక ౘ పోస్టింగ్ ఉత్తర్వులు అందజేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్ . ఐపీఎస్....



**అంకుశం న్యూస్, అనంతపురం, జూలై : 14** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడా కోటా (స్పోర్ట్స్ కోటా) కింద ఎంపికైన 18 మంది గ్రామ మహిళా సంరక్షకులకు ( జి ఎం ఎస్ కే) జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నియామక, పోస్టింగ్ ఉత్తర్వులను జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఐపీఎస్ గారు అందజేశారు.

**కోర్టు ఉత్తర్వుల మేరకు నియామకాలు:**

2019 నోటిఫికేషన్‌కు చెందిన ఈ అభ్యర్థుల నియామక ప్రక్రియపై గౌరవ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఈ నూతన అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ కమ్ పోస్టింగ్ ఆర్డర్లను జారీ చేసినట్లు ఎస్పీ వివరించారు.

**బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి:**

ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ ఐపీఎస్ నూతనంగా విధుల్లోకి చేరుతున్న మహిళా పోలీసులతో మాట్లాడారు. క్రీడా స్ఫూర్తితో విధుల్లోనూ రాణించాలని, గ్రామాల్లో మహిళలు, బాలల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు, పోలీసు శాఖకు మధ్య వారధిలా పనిచేస్తూ.. బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడటంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. చట్టాలపై అవగాహన పెంచుకుని, అంకితభావంతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.నాగభూషణం, ఎస్ మహబూబ్ బాషా, జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలనాధికారి రవిరాం నాయక్ , సీనియర్ అసిస్టెంట్ నందకుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి భీమవరం పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైసీపీ నేతలు

**ఆక్వా రైతులు, రైతునేతలతో సమావేశంకానున్న జగన్ మోహన్ రెడ్డి**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 14:** వైఎస్ఆర్సిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 15 తారీకున పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పర్యటించిన అనంతరం ఆక్వా రైతులు, రైతునేతలతో సమావేశంకానున్న సందర్భంగా ఆచంట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో మాజీ మంత్రివర్యులు ఆచంట నియోజవర్గ కోఆర్డినేటర్ చెరుకువాడ రంగనాథ రాజు ఆధ్వర్యంలో, చెరుకువాడ నరేష్ రాజు అధ్యక్షన మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్, మాజీ రుడా చైర్పర్సన్,రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శి ౘ ఆచంట నియోజకవర్గ పరిశీలకులు శ్రీమతి మేడపాటి షర్మిళారెడ్డి మరియు ఆచంట నియోజకవర్గ సీనియర్ నేతలతో కలిసి సమావేశంలో వైయస్ జగనన్న పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

## ఏపీ లో ఎస్ ఐ ఆర్ గడువు పెంపు

**ఈ నెల 24 వరకు గడువు పెంచుతూ ఈసీ నిర్ణయం**

**అంకుశం న్యూస్,అనంతపురం, జూలై : 14** ఏపీ సీఈఓ అభ్యర్థన మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసిన ఈసీ జూన్ 15 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న బీఎల్‌ఓల ఇళ్ల సందర్శన ప్రక్రియ. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి జూలై 24 తుది గడువు. జూలై 31న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు అవకాశం. దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 లోపు పరిష్కరించనున్న అధికారులు. అక్టోబర్ 3, 2026న ఆంధ్రప్రదేశ్ ఓటర్ల తుది జాబితా ప్రచురణ చేయబడునన్నారు.

## ఈనెల 18వ తేదీన మూడవ శనివారం "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం

**జులై నెల "వరదలు - సిద్ధంగా ఉన్న ఆంధ్ర"థీమ్ తో కార్యక్రమం నిర్వహించాలి**

**డిపిఓ నాగరాజునాయుడు..**



**అంకుశం న్యూస్అనంతపురం, జులై 14 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీన "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని డిపిఓ నాగరాజునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జులై నెల "వరదలు – సిద్ధంగా ఉన్న ఆంధ్ర" థీమ్ తో కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. పౌరులు, వార్డు/గ్రామ వాలంటీర్లు, ఆర్ డబ్ల్యు ఎలు, యువజన బృందాలు, ఎన్హెచ్ఐలు, పారిశుధ్య కార్మికులు, యుఎల్బిలు/జిపిలు, ఎంఏ౿ యుడి, పిఆర్డి ఆర్డి, నీటిపారుదల శాఖ, రెవెన్యూ ౘ విపత్తు నిర్వహణ శాఖ, ఆరోగ్య శాఖ, ఎన్జిఓలు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు, మీడియా వారు మూడవ శనివారం నిర్వహించే "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. – జిల్లాలో ఎస్ఏఎస్ఏ వెబ్సైటులో ఫోటోలు, వీడియోలు, రీల్స్ మరియు విజయగాథలను డాక్యుమెంటేషన్ రూపంలో సమర్పించాలన్నారు. ఎస్ఏఎస్ఏ యాప్ లో ఏఏ యాక్టివిటీలను చేపట్టారు, క్యాటగిరీ వారిగా ఎంతమంది ఇందులో పాల్గొన్నారు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమం గురించి ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, సంస్థలకు, అధికారులకు, మీడియాకు ముందుగానే సమాచారం అందించాలని, ఇందులో చేపట్టే పనులన్నీ వారి జీవన విధానంలో భాగం అయ్యేలా అవగాహన కల్పించి, ఒక పండుగ వాతావరణంలో "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించి, విజయవంతం చేయాలని డిపిఓ కోరారు.

## మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి మంత్రి సుభాష్ రూ.10 వేల ఆర్థిక సాయం



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 14:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీనివాస్ కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు మంత్రి సుభాష్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. విషయాన్ని తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే శ్రీనివాస్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు కాకినాడలోని ఆసుపత్రిలో చికిత్స చేయించాలని తన వ్యక్తిగత సిబ్బందికి సూచించారు. బాధితుడికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని తక్షణ ఆర్థిక సాయం అందించిన మంత్రి సుభాష్‌కు శ్రీనివాస్ భార్య రామలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై సత్వర స్పందనతో మంత్రి సుభాష్ ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలు, పాఠశాలల్లో నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తే కఠిన చర్యలు

**రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఇ. లక్ష్మీరెడ్డి**

**మోడల్ అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లో విస్తృత తనిఖీలు**





**అంకుశం న్యూస్ పుట్టపర్తి జూలై 14:** సత్యసాయి జిల్లాలో అంగన్వాడీలు పాఠశాలల్లో నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు అందరూ జాగ్రత్తగా పని చేయాలని పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు ఇస్తుంటే వాటిని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి హెచ్చరించారు సత్యసాయి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మోడల్ అంగన్వాడి కేంద్రాలు స్కూల్స్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంపూర్ణ పోషణ మరియు మధ్యాహ్న భోజన పథకం (వీణవీ) అమలులో ఎలాం లోపాలు లేకుండా చూడాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మి రెడ్డి సూచించారు ఈ కార్యక్రమం లో డిఎస్ఓ వంశీ కృష్ణ రెడ్డి,సివిల్ సప్లైస్ డిఎం రాజు నాయక్,ఐసిడిఎస్ పిడి ప్రమీల,వీణవీ ఎడి వినయ్,బిసి సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి,గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారం సమర్పణ గడువు జూలై 24 వరకు పొడిగింపు: బిజెపి ఎస్సీ మోర్చ సోషియల్ మీడియా కో కన్వీనర్ జయరాం.



**అంకుశం న్యూస్, కదిరి,జూలై:14:** ఎస్ ఐ ఆర్ పొడిగింపు సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సోషల్ మీడియా కో కన్వీనర్ ఎస్సీ మోర్చ జయరాం తెలియజేస్తూ ఏమనగా ఎస్ ఐ ఆర్ ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేసి మీ ఓటు హక్కును భద్రపరచుకోవాలని కోరారు. ఇంకా ఎస్ ఐ ఆర్ ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేయని ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. మీ ఓటరు వివరాలు సక్రమంగా నమోదయ్యాయో లేదో నిర్ధారించుకోవాల్సిన అవసరం ప్రతి ఓటరు మీద ఉందదన్నారు. అలాగే పేరు, చిరునామా,కుటుంబ వివరాల్లో అవసరమైన సవరణలు సక్రమంగా ఉన్నాయా లేదా చూసుకోవాలన్నారుఅదే విధంగా మీ కుటుంబంలోని ప్రతి సభ్యుడి వివరాలు నమోదు అయ్యేలా చూసుకోండన్నారు. చివరి తేదీ కోసం వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఫారం పూర్తి చేయాలని కోరారు. ఓటు హక్కు అనేది ప్రతి భారత పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని దానిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ నెల 24 చివరి వరకు పొడిగిస్తూ రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి సందీప్ కుమార్ నేడు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ లోపు ప్రతి ఓటరు జాబితాలో కచ్చితంగా ఓటు నమోదు ప్రక్రియలో భాగంగా బిఎల్ఓ ను కలిసి నమోదు చేసుకోవాలన్నారు.

## మాజీ సర్పంచ్, మండల ప్రధాన కార్యదర్శి పరిశీలన



**అంకుశం న్యూస్ మడకశిర జూలై. 14** ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు నిర్వహించాలని సూచన గుడిబండ మండల పరిధిలోని జమ్మలబండ గ్రామపంచాయతీ సచివాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ వెరిఫికేషన్ ప్రక్రియను గ్రామ మాజీ సర్పంచ్, తెలుగుదేశ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా వెరిఫికేషన్ పనులు సక్రమంగా జరుగుతున్నాయా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందుతున్నాయా అనే అంశాలను వారు పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు అవసరమైన పత్రాలతో సచివాలయానికి వచ్చి వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఈ ఎస్ మంజునాథ, ప్రతినిధులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖరీఫ్ 2026 వాతావరణ ఆధారిత పంటల బీమా కచ్చితంగా నమోదు చేసుకోండి

**మండల వ్యవసాయ అధికారి హెచ్. పెన్నయ్య**



**అంకుశం న్యూస్ ఉరవకొండ జూలై 14 :** అనుకోని వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టం సంభవించే అవకాశం ఉందని మీ పంటకు ఆర్థిక రక్షణ కల్పించుకోవడానికి ఖరీఫ్--2026 వాతావరణ ఆధారిత పంటల బీమా తప్పనిసరిగా నమోదు చేసుకోవలని విడపనకల్ మండల వ్యవసాయ అధికారి హెచ్. పెన్నయ్య సూచించారు. జిల్లాలో పంటల వారీగా రైతు ప్రీమియం (ఎకరానికి):

1. వేరుశెనగ -- రూ.640
2. పత్తి -- రూ.1,140
3. అరటి -- రూ.3,000
4. దానిమ్మ -- రూ.3,750
5. బత్తాయి -- రూ.2,750
6. టమాటా -- రూ.1,600

నమోదు జూలై 31 లోపల చేసుకోవాలన్నారు. రుణ రైతులు తమ రుణం తీసుకున్న బ్యాంకు శాఖలో నమోదు చేసుకోవాలని,రుణం తీసుకోని రైతులు: సమీపంలోని సిఎస్సి / మీ సేవా కేంద్రం లేదా ఏఐసిపిఓఎస్పి ద్వారా నమోదు చేసుకోవలన్నారు. మరింత సమాచారం కోసం:

ఏఐసి ప్రతినిధి జి శ్రీనివాస ఉరవకొండ

సెల్ నెంబర్ : 9912654011 సంప్రదించాలన్నారు.

ప్రకృతి మారినా... ఏఐసి మీ పంటకు అండగా పంటల బీమా ఉంటుందన్నారు.

# అనంతలో రేపు జులై 15వ తేదీన కలెక్టరేట్‌లో
# ప్రజా సమస్యల పరిష్కార వేదిక,

– : బుధవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..

– : జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

– : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

**అంకుశం న్యూస్అనంతపురం, జులై 14 :** – అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోని కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రేపు ఉదయం జరుగుతుందని జిల్లాలోని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపునిచ్చారులిమీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్



1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.లి

**జులై 15వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :**

– జులై 15వ తేదీన బుధవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. బుధవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు. – ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్స్అప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# పొలం పిలుస్తోంది...

**అంకుశం న్యూస్, సింగనమల, జూలై : 14** ఈరోజు పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా ఆకులేడు గ్రామాన్ని సందర్శించటం జరిగింది. రైతులు సాగు చేసిన పంట ల వివరాలు చర్చించటం జరిగింది. వాతావరణ భీమా, మరియు ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన గురించి రైతులకు తెలియచేయటం జరిగింది. వాతావరణ భీమా కింద వేరుశనగ ఎకరాకు ప్రీమియం రూ.640( ఎకరాకు భీమా రూ.32000) , ప్రత్తి ఎకరాకు ప్రీమియం రూ.1140(ఎకరాకు భీమా రూ. 38000) ఏఐసి ఎల్ టి డి పేరుతో బ్యాంకు లో కాని మీసేవ సెంటర్ లలో కాని చెల్లించాలి.. అఖరు తేదీ 15-7-2026.అదే విధంగా ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన కింద కంది (గ్రామ యూనిట్ ) ఎకరాకు ప్రీమియం రూ.80 (భీమా మొత్తం రూ. 20000) అఖరు తేదీ 31-7-26.. వరి ఎకరాకు ప్రీమియం రూ.164 (అఖరు తేదీ 15-8-26) జొన్న ఎకరాకు ప్రీమియం రూ.84, మొక్కజొన్న ఎకరాకు ప్రీమియం రూ. 132, ఆముదం ఎకరాకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం రూ. 80 సెంట్రల్ జనరేలి ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కి




చెల్లించాలి...ఈ పంటల కు అఖరు తేదీ 31-7-26. అని తెలపటం జరిగింది. బ్యాంకు లలో లేదా మీసేవ సెంటర్ లలో రైతే స్వయంగా సాగు ధ్రువీకరణ పత్రం ను అందచేస్తూ ఇన్సూరెన్సు చేయవచ్చు అని మండల వ్యవసాయ అధికారి తెలపడం తెలియచేయటం జరిగింది.

# ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ..

ప్రజాస్వామ్యంపై నిరంకుశ దాడి

'ఉపా' చట్టం దుర్వినియోగం

**విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

**(అంకుశం, అమరావతి, జూలై 14):** రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల దష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందన్నిత్తారు. ప్రజా సమస్యల గురించి ప్రశ్నించే ప్రజాస్వామిక శక్తులపై అక్రమ కేసులు, ఉపా చట్టం ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలపై జరుగుతున్న దాడిలో భాగమని ఆయన అన్నారు. ఒక వైపు ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, రక్షణ కోసం వచ్చిన వారిని రక్షక భటులే భక్షకులుగా మారి లాకప్‌డెత్‌లు చేయడం, వేధింపుల పర్వం సంఘటనలు కొనసాగడం విచారకరమన్నారు. సీపీఐ జాతీయ పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 15 వరకు 'మార్పు కోసం' అనే నినాదంతో రాష్ట్రంలో ప్రచార యాత్రలు, పాదయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలు, 674 మండలాలు, వందలాది గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర




ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఆగస్టు 17 నుంచి 27 వరకు పార్టీ అనుబంధ ప్రజాసంఘాలు తమ తమ సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాయని తెలిపారు. సెప్టెంబర్ 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే మహాసభకు రాష్ట్రం నుంచి సుమారు మూడు వేల మందిని సమీకరిస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ చివరి వారంలో కడపలో నాలుగు రోజులపాటు సీపీఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తామని ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

## మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

అర్హులందరి సంక్షేమానికి నిధులు పూర్తిగా చేరాలి

అంచనాల కమిటీ సమావేశంలో రాష్ట్రాధికారులకు చైర్మన్ వేగుళ్ళ ఆదేశాలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 14:** రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాల్-1లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర అంచనాల కమిటీ సమావేశంలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ బడ్జెట్ అంచనాలు, నిధుల కేటాయింపులు, సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వేగుళ్ళ మాట్లాడుతూ, ఆయా శాఖలకు కేటాయించిన నిధులు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో, పూర్తి స్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న పథకాల పురోగతి, నిధుల వినియోగం, రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాలపై ఉన్నతాధికారులు కమిటీకి నివేదికలు సమర్పించారు. ఈ



సమావేశంలో కమిటీ సభ్యులు, గూడూరు ఎమ్మెల్యే పాసం సునీల్ కుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి, ఐఏఎస్, డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఐఏఎస్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో ఇ.యస్.ఐ ఆసుపత్రి సమస్యలు, పై మాట్లాడుతా

ఎంపీ కేశినేని శివనాథ్

త్వరలో అత్యాధునిక హంగులతో మరింతగా ఇ.యస్.ఐ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తానని హామీ





**అంకుశం న్యూస్ విజయవాడ జూలై 14** గుణదల,ఇ.యస్.ఐ ఆసుపత్రి) విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని గుణదల ప్రాంతంలో ఉన్న ఇ.యస్.ఐ ఆసుపత్రిని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు ఉన్న సౌకర్యాలు మరియు సదుపాయాలపై ఎంపీ చిన్ని ఆరా తీశారు. నేరుగా పేషెంట్స్ వార్డులో ఉన్న రోగుల వద్దకు వెళ్లి అక్కడ వారికి అందుతున్న వైద్య సేవలపై మాట్లాడారు ప్రతి వార్డుకు వెళ్లి ఆసుపత్రి మొత్తాన్ని పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది కావలసిన అవసరాలు ఉన్నటువంటి సమస్యలు ను సైతం అడిగి తెలుసుకొని పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడలో ఇ.యస్.ఐ డిపార్ట్మెంట్ హాస్పిటల్ సుమారుగా 1968 లో ప్రారంభించారు సుమారుగా 3 లక్షల కార్డు హోల్డర్స్ ఇక్కడ సేవలను వినియోగించుకుంటున్నారని కొత్తగా మొన్నటి వరకు బేస్ శాలరీ 21 వేల వరకే ఈఎస్ఐ కార్డ్ హోల్డర్ల కింద ఎలిజిబిలిటీ ఉండేదని కేంద్ర ప్రభుత్వం 42 వేల వరకు తీసుకు వెళ్లడం జరిగిందని అన్నారు ఈరోజు ఉన్న కార్డు హోల్డర్ల కన్నా సుమారు రెండు నుంచి మూడు రెట్లు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు ఇటువంటి ప్రతిష్టాత్మక సంస్థని ఈరోజు పరిశీలించడం జరిగిందని ఇక్కడ సిబ్బందికి ఎలాంటి అవసరాలు ఉన్నాయని వాటి మీద దృష్టి పెట్టి రేపు 20వ తారీకు నుంచి జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాలన్నిటినీ ప్రస్తావిస్తానని తెలియజేశారు సమస్యలు ఏమున్నా మంత్రులు మరియు సెక్రటరీల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. చాలా చక్కగా శుభ్రంగా ఆసుపత్రిని మెయింటైన్ చేస్తున్నారని ఇక్కడ సేవలు అందరి చోట 21 హాస్పిటల్ కి రిఫరల్ కూడా చేస్తున్నారని అన్నార ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని, ఆసుపత్రి మెడికల్ సూపర్‌డెంట్ డాక్టర్ వి.జ్యోతి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గాంధీ ఆర్.ఎం.ఓ డాక్టర్ జయశ్రీ, సీనియర్ డాక్టర్ రవికుమార్, మరియు ఇతర వైద్యులు,నర్సింగ్ ఒ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ గడువు పెంచారు..
## ప్రతి ఒక్కరూ గమనించాలి

**పరిటాల సునీత...**



**అంకుశం న్యూస్, రాప్తాడు, జూలై : 14** ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ గడువు పెంచిన నేపథ్యంలో మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్ ఛార్జిలు ప్రత్యేకంగా ఆ అంశంపై దృష్టి సారించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బుధవారం రోజు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించాలని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్ ఛార్జిలు వారి మండల స్థాయిలో పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. యూనిట్, గ్రామం, పోలింగ్ బూత్ స్థాయిలో ఉన్న ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ పరంగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించి అవసరమైన తీర్మానాలు చేయాలన్నారు. అక్కడ తీర్మానం చేసిన అంశాలను మై టీడీపీ యాప్ లో నమోదు చేయాలన్నారు. యాప్ లో అప్లోడ్ చేయకపోతే సమావేశం జరిగినట్లు పార్టీ పరిగణనలోకి తీసుకోదని స్పష్టం చేశారు. అభివృద్ధి అంశాలతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి ఈ సమావేశంలో చర్చించాలన్నారు. ఈనెల 14వ తేదికి గడువు ముగిసినప్పటికీ ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో గడువు పెంచిందన్నారు. ఈనెల 24వరకు బీఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫామ్ లు తీసుకుంటారన్నారు. ఇంకా ఎవరైనా ఎన్యూమరేషన్ ఫామ్ లు ఇవ్వకపోతే.. బీఎల్ఏలు వారి ఇళ్లకు వెళ్లి సేకరించాలన్నారు. దీనిని క్లస్టర్, మండల ఇన్ ఛార్జిలు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు..

## పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ కోసం వారు రూ. 2 లక్షల విరాళం

సిఎస్ఆర్ విరాళాన్ని అందించడం అభినందనీయం..

– : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



**అంకుశం న్యూస్అనంతపురం, జులై 14 :** – అనంతపురం జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ – 2026 కోసం సిఎస్ఆర్ కింద సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ వారు 2 లక్షల రూపాయల విరాళాన్ని అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ – 2026 కోసం సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ వారు రూ. 2 లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్ ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కు సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ ప్రతినిధులు, డిఎస్డీఓ మంజుల అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ – 2026 కోసం సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ వారు 2 లక్షల రూపాయల విరాళం అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా డిఎస్డీఓ మంజుల మాట్లాడుతూ జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ కోసం సిఎస్ఆర్ కింద సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ వారు 2 లక్షల రూపాయల విరాళాన్ని అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.